క్లుప్తంగా

గంగమ్మకు దద్దాల ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న దద్దాల నారాయణ

పీసీపల్లి: జిల్లాలో ప్రసిద్ధి గాంచిన గంగ తిరునాళ్ల సందర్భంగా వైఎస్సార్ సీపీ కనిగిరి అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్ ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని గంగమ్మను వేడుకున్నట్లు ఆయన తెలిపారు. జూన్ 4న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వస్తుందన్నారు. తొలుత గ్రామస్తులు దద్దాల నారాయణకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయ సాంప్రదాయాలతో నిర్వాహకులు, గ్రామస్తులు సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పొగాకు సరాసరి ధర రూ.255.07



వేలం నిర్వహిస్తున్న నిర్వహణాధికారి సునీల్‌కుమార్

కొండపి (సింగరాయకొండ): కొండపిలోని పొగాకు వేలం కేంద్రంలో సోమవారం నిర్వహించిన వేలంలో పొగాకు సరాసరి ధర రూ.255.07 పలికిందని వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. వ్యాపారులు అనకర్లపూడి, పెరిదేపి, మిట్టపాలెం, ముప్పరాజుపాలెం గ్రామాలకు చెందిన రైతులకు చెందిన 856 బేళ్లలో 767 కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 89 బేళ్లను వ్యాపారులు తిరస్కరించారు. కేజీ పొగాకు గరిష్ట ధర రూ.320, కనిష్ట ధర రూ.205, సరాసరి ధర రూ.255.07 పలికింది. వేలంలో 21 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువుల వినియోగం మేలు




పెంట్రాలలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

లింగసముద్రం: సేంద్రియ జీవన ఎరువుల వినియోగం ద్వారా భూమి సారవంతమై మొక్కలకు పోషకాలు అందుతాయని వ్యవసాయాధికారి టి.అబ్రహంలింకన్ రైతులకు సూచించారు. లింగసముద్రం-2, పెంట్రాల రైతుభరోసా కేంద్రాల్లో పీఎం ప్రణామ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం రైతులకు సేంద్రియ ఎరువులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువులు ఎక్కువగా వాడటం వలన భూసారం తగ్గిపోతుందని, ప్రతి రైతు సేంద్రియ ఎరువులకు ఉపయోగించాలని సూచించారు. పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగలు, జనుములు, పిల్లిపెసర్లు 50 శాతం రాయితీపై రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంటాయని, విత్తనాలు పొందేందుకు రైతులు గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వీఏఏలు రేణుక, కిరణ్ రైతులు పాల్గొన్నారు.

నారాయణస్వామి ఆదాయం రూ.1.88 లక్షలు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయానికి ఆదివారం రూ.1.88,242 ఆదాయం వచ్చినట్లు ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన ఆదినారాయణ, ఈఓ శ్రీగిరిరాజు నరసింహ బాబు తెలిపారు. స్వామి దర్శనం టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.1,02,150, లడ్డు ప్రసాదాల అమ్మకంద్వారా రూ.37,260, ఆలయం వద్ద నిర్వహిస్తున్న శాశ్వత అన్నదానం పథకం నిర్వహణకు విరాళాలుగా రూ.48,832 వచ్చాయన్నారు. కార్యక్రమంలో కొమ్మినేని వెంకట్రావు పాల్గొన్నారు.

గంధ మహోత్సవం కరపత్రం ఆవిష్కరణ



గంధ మహోత్సవ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దర్గా కమిటీ సభ్యులు

గుడ్లూరు: మండలంలోని తెట్టులోని సుల్తాన్ బీబీ అమ్మవారి గంధ మహోత్సం కర పత్రాలను సుల్తాన్ బీబీ దర్గా ప్రెసిడెంట్ షేక్ జిలానీ భాష, మండల కో ఆప్షన్ సభ్యులు రషీద్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సయ్యద్ సుల్తాన్ అమ్మవారి 132వ గంధ మహోత్సవ వేడుకలను ఈ నెల 30వ తేదీ గురువారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర నలుమూలలు నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా వేలాదిగా భక్తులు హాజరవుతారన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. గంధ మహోత్సవ నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య

- 25 శాతం సీట్ల కేటాయింపు
- రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో పేద విద్యార్థులకు లబ్ధి
- నియోజకవర్గంలో 33 మంది దరఖాస్తులు



పాఠశాలల్లోని విద్యార్థులు

కనిగిరి రూరల్: విద్యా హక్కు చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం పక్కా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంది. విద్యా సంవత్సర ప్రారంభం నుంచి దృష్టి సారించి నోటిఫికేషన్ జారీ చేసి ప్రభుత్వం చిత్తశుద్ధిని చాటుకుంది. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో విద్యను అందించేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పేద విద్యార్థుల పాలిట వరంగా మారింది. విద్యా హక్కు చట్టం ప్రకారం 12(1)సీ ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు ఉచితంగా ఇవ్వాల్సి ఉంటుంది. ఈ మేరకు వారికి ఒకటో తరగతిలో ప్రవేశాలకు అవకాశం కల్పించారు. పాఠశాలల్లో ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన వారి జాబితాలను విద్యాశాఖ అధికారులు సిద్ధం చేశారు. మొదటి విడతలో కనిగిరి నియోజకవర్గంలో 33 మంది విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, హెచ్ఐవీ బాధితుల పిల్లలకు ప్రాధాన్యం ఇచ్చారు. ఉచిత ప్రవేశాలకు నిరాకరించిన యాజమాన్యాలపై విద్యా శాఖ చర్యలు తీసుకుంటుందని అధికారులు వెల్లడించారు.

టీడీపీ హయాంలో నిర్వీర్యం..

విద్యా హక్కు చట్టాన్ని టీడీపీ హయాంలో నిర్వీర్యం చేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25శాతం సీట్లు ఉచితం అమలుకు నోచుకోలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఒకటో తరగతి నుంచి ఉచిత విద్యనందించేందుకు 2020-22 విద్యా సంవత్సరంలో శ్రీకారం చుట్టినట్లు అధికారులు వెల్లడించారు. నిబంధనల ప్రకారం అర్హత ఉన్న వారిని ఎంపిక చేస్తున్నారు.

మండలాల వారీగా కేటాయించిన సీట్లు ఇవే..

మండలం పేరు	ఎంపికైన విద్యార్థుల సంఖ్య
కనిగిరి	11
పామూరు	15
సీఎస్‌పురం	1
వెలిగండ్ల	6

పేద విద్యార్థులకు వరంలాంటిది



విద్యా హక్కు చట్టం ప్రకారం పేద విద్యార్థులకు ఒకటో తరగతిలో ప్రవేశానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇది పేద విద్యార్థులకు వరం లాంటిది. ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటో తరగతి ప్రవేశానికి విడుదలైన నోటిఫికేషన్ ప్రకారం అర్హులైన వారు దరఖాస్తు చేసుకున్నారు. పేద కుటుంబాల విద్యార్థులతో పాటు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, హెచ్ఐవీ బాధితుల పిల్లలకు అర్హులుగా గుర్తించి తొలి ప్రాధాన్యత నిచ్చాం.

– యు నారాయణరెడ్డి (ఎంఈఓ కనిగిరి)

సమ్మర్ క్యాంపు ప్రారంభం



క్యాంపును ప్రారంభిస్తున్న చెన్నకృష్ణ

పామూరు: చిన్నారులకు సాంస్కృతిక కార్యక్రమాలు, అభ్యుదయ గేయాలు ఇతర అంశాల్లో తర్ఫీదునిచ్చేందుకు చిల్డ్రన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమ్మర్ క్యాంపెయిన్ ఎంతో ఉపయోగపడుతుందని జేవీవీ గౌరవాధ్యక్షుడు డాక్టర్ తిరివీధి చెన్నకృష్ణ అన్నారు. పామూరు వడ్డెపాలెం ఎంపీపీఎస్ పాఠశాలలో సోమవారం నుండి ఈనెల 31వ తేదీ శుక్రవారం వరకు నిర్వహించనున్న సమ్మర్ క్యాంపును సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ చెన్నకృష్ణ మాట్లాడుతూ 5 రోజుల పాటు చిన్నారులకు అభ్యుదయ గేయాలు, ఆటపాటలు, మేథమేటిక్స్, డ్రాయింగ్ కార్టూన్స్ మొదలైన అంశాల్లో తర్ఫీదు ఇవ్వనున్నట్లు తెలిపారు. టీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ సభ్యులు పేట తిరుపతిరెడ్డి, యూటీఎఫ్ సీనియర్ నాయకులు ఎం శ్రీనివాసరాజు, ఐద్వా ప్రధాన కార్యదర్శి కె.రమాదేవి, అధ్యక్షురాలు సయ్యద్ షర్మిల, జేవీవీ నాయకులు కె.శంకర్, భానుమతి, బత్తుల పరిమళాదేవి, విద్యార్థులు, పలువురు పాల్గొన్నారు.

హద్దుమీరితే రౌడీషీట్లు తెరుస్తాం

- లెక్కింపు రోజు అల్లర్లు, గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు
- కనిగిరి డీఎస్పీ రత్నాకరం రామరాజు



రత్నాకరం రామరాజు, డీఎస్పీ

కనిగిరి రూరల్: సార్వత్రిక ఎన్నికల లెక్కింపు జూన్ 4న జరగనుంది. ఈ నేపథ్యంలో శాంతి భద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా కనిగిరి డివిజన్‌లో పక్కా ప్రణాళికతో పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు కనిగిరి డీఎస్పీ రత్నాకరం రామరాజు అన్నారు. స్థానిక కార్యాలయంలో సాక్షితో పలు అంశాలను వెల్లడించారు. ఓట్ల లెక్కింపు తర్వాత ఎటువంటి హింసాత్మక ఘటనలు ఉత్పన్నం కాకుండా ముందస్తుగా ఉక్కుపాదం మోపుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే కనిగిరి పోలీస్ డివిజన్ పరిధిలోని 9 మండలాల్లోని అన్ని స్టేషన్‌ల పరిధిలో మాక్‌డ్రిల్, కవాతు, కార్డన్ సెర్చ్ నిర్వహించామన్నారు. ఈ నెల 16 నుంచి డివిజన్ వ్యాప్తంగా 236 మందిపై బైండోర్ కేసులు నమోదు చేశామన్నారు. కార్డన్ సెర్చ్‌లో సుమారు 550 వాహనాలను సీజ్ చేశామని, వాటిలో లైసెన్స్ లేని సరైన పత్రాలు లేని వాటిని ఎంవీఐ అధికారికి అప్పగించి రూ.2 వేల నుంచి రూ. 9 వేల వరకు జరిమానా విధించినట్లు చెప్పారు. ఇప్పటి సుమారు 36 గ్రామాల్లో కార్డన్ సెర్చ్ చేశామని, సమస్యాత్మక, తీవ్ర సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొన్నరు. ఆయా గ్రామాల్లో శాంతి కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. పోలీస్ డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. కౌంటింగ్ ముగిశాక ఎక్కడా గొడవలు, ఘర్షణలు జరగకుండా ప్రతి పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైతో పాటు, సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఏ పార్టీ గెలిచినా విజయోత్సవ ర్యాలీలు, బాణసంచా పేలుళ్లకు అనుమతించేది లేదన్నారు. పెట్రోల్, డీజిల్ వంటివి బాటిళ్లకు వేయకుండా డీలర్లకు, దుకాణదారులకు ఆదేశాలిచ్చామన్నారు. కనిగిరి పామూరు, కొండపి లైసెన్స్ క్రాకర్స్ దుకాణాల్లో తనిఖీలు చేశామని, జూన్ 6 వరకు అమ్మకూడదని ఆదేశాలిచ్చామన్నారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు పకడ్బందీ చర్యలు చేపట్టామని వివరించారు. జూన్ 6 వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందన్నారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

గుడిపాటిపల్లిలో కార్డన్ సెర్చ్

వెలిగండ్ల: అసాంఘిక శక్తులను అణచివేసే దిశగా పోలీసు యంత్రాంగం కార్డన్ సెర్చ్ ఆపరేషన్‌కు శ్రీకారం చుట్టింది. మండలంలోని గుడిపాటిపల్లిలో పామూరు సీఐ రామానాయక్ ఆధ్వర్యంలో వెలిగండ్ల, పామూరు, సీఎస్‌పురం ఎస్సైలు కలిసి గ్రామంలో సోమవారం కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఎన్నికల ఫలితాలు ప్రక్రియ పూర్తయ్యే వరకు కార్డన్ సెర్చ్ ఆపరేషన్ అమలు ప్రక్రియ జరుగుతుందన్నారు. కౌంటింగ్ రోజు ఎన్నికల ఫలితాలు విడుదలైన తర్వాత బాణసంచా కాలర్చరాదన్నారు. ఎటువంటి ర్యాలీలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. సరైన పత్రాలు లేని 18 వాహనాలను సీజ్ చేశారు. పామూరు, సీఎస్‌పురం ఎస్సైలు ప్రేమ్‌కుమార్, సైదుబాబు పాల్గొన్నారు.

లింగసముద్రంలో...

లింగసముద్రం: మండలంలోని మొగిలిచర్లలో గుడ్లూరు సీఐ బీవీవీ సుబ్బారావు ఆధ్వర్యంలో ఎస్సై ఎం.బాజీబాబు, వలేటివారిపాలెం ఎస్సై మహేంద్రనాయక్ సిబ్బందితో కలిసి సోమవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తనిఖీల్లో సరైన పత్రాలు లేని ఏడు మోటార్‌సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఇళ్లల్లో ఎలాంటి మారణాయుధాలు ఉంచుకోకూడదని, అలాంటివి ఉన్నట్లు తెలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా పార్టీల పరంగా కవ్వింపు చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



మొగిలిచర్లలో పోలీసులు స్వాధీనం చేసుకున్న మోటార్‌సైకిళ్లు



గుడిపాటిపల్లిలో కార్డన్ సెర్చ్‌లో పోలీసులు

భారీ మెజారిటీతో గెలుస్తున్నాం



పాత మల్లవరంలో నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న దద్దాల నారాయణ

హనుమంతునిపాడు: కనిగిరిలో భారీ మెజారిటీతో విజయం సాధిస్తామని వైఎస్సార్ సీపీ అభ్యర్థి దద్దాల నారాయయ యాదవ్ అన్నారు, మండలంలోని కూటాగుంట్ల పంచాయతీ పరిధిలోని పాతమల్లవరంలో సోమవారం జరిగిన నాగారపు వెల్లమ్మ కొలుపుల్లో ఆయన పాల్గొన్నారు. తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అక్కడికి వచ్చిన నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ మరోసారి జెండా ఎగరవేయడం ఖాయమన్నారు. అన్ని వర్గాల ప్రజలు వైఎస్సార్ సీపీ ఓటు వేశారని, భారీ మెజారిటీ సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మరోసారి వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చి జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అవుతారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి, రైతు సంఘ అధ్యక్షుడు శ్యామల సాంబిరెడ్డి, సర్పంచ్ గాలం రామక్రిష్ణ, గుడిపాటిపల్లి సర్పంచ్ కటికల వెంకటరత్నం, మాజీ సర్పంచ్ బైనబోయిన కాటంరాజు, నాయకులు గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, మునలయ్య, నాగార్జునరెడ్డి, కోటపాటి మోహన్‌రెడ్డి, వెంకటస్వామిరెడ్డి, వెంకటరెడ్డి, కె.వెంకటకాశయ్య, గాలం తిరుపతయ్య, నాలి వెంకటేశ్వర్లు, టి.తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రుచికరమైన భోజనం అందించాలి



కుకింగ్ సిబ్బందికి సూచనలిస్తున్న ఎంఈఓ రమణయ్య



కనిగిరిలో శిక్షణ ఇస్తున్న ఎంఈఓలు

ఉలవపాడు: విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని ఎంఈఓ రమణయ్య అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల పరిధిలోని మధ్యాహ్న భోజన పథక వంట మనుషులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరలా బడులు పునఃప్రారంభం అవుతున్న నేపథ్యంలో కుకింగ్ ఏజెన్సీ నిర్వాహకులు నాణ్యమైన భోజనం వండాలన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి పాఠశాలలోనే తినాలని సూచించారు. పాఠశాలల్లో కుకింగ్ షెడ్‌లు అన్నీ పరిశుభ్రం చేసుకోవాలన్నారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సలీమ్‌బాషా, విద్యా సిబ్బంది పాల్గొన్నారు.

కనిగిరి రూరల్: విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని నాణ్యతగా, శుచి, శుభ్రతగా అందచేయాలని ఎంఈఓలు యు నారాయణరెడ్డి, జి.సంజీవి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మధ్యాహ్న భోజన వంట మనుషులకు సోమవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ యు నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో వంట మనుషులు విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. హెచ్‌ఎంలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



రంగు కాగితాలతో తయారు చేసిన బొమ్మలు చూపిస్తున్న చిన్నారులు



ఉలవపాడు గ్రంథాలయంలో విద్యార్థులకు ఖోఖో పోటీలు

కొండపి(సింగరాయకొండ): విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథపాలకుడు బి.కోటేశ్వరరావు కోరారు. ప్రతి విద్యార్థి పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని సూచించారు. విద్యార్థులకు జూనియర్స్, సీనియర్స్ విభాగంలో క్యారమ్స్ పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు సీహెచ్ ఆంజనేయులు, శ్రీధర్ విద్యార్థులకు ఇంగ్లిష్ సబ్జెక్ట్‌పై విద్యార్థులకు మెళకువలు నేర్పించారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు.

టంగుటూరు: స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరానికి విశేష స్పందన లభించింది. సోమవారం శిబిరంలో విద్యార్థులకు పుస్తక పఠనం చేయించారు. తల్లిదండ్రులు పిల్లలను తప్పక గ్రంథాలయాలకు పంపాలని కోరారు.

వేసవి ఉచిత శిక్షణతో ఆనందం

కొండపి (సింగరాయకొండ): వేసవి ఉచిత శిక్షణ తరగతులు చిన్నారుల్లో ఎంతో ఆనందాన్ని నింపుతున్నాయని కోర్స్ డైరెక్టర్ ఎల్‌వీ ప్రసాద్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ టి.జె. ఇన్నోవేటివ్ సెంటర్‌లో ఈ నెల 20వ తేదీ నుంచి నిర్వహిస్తున్న తరగతులు విద్యార్థుల్లో గణితం బేసిక్స్, స్పోకెన్ ఇంగ్లిష్, హిందీ అంటే భయం పోగొట్టడంతో పాటు చక్కని చేతిరాత నేర్చుకునేందుకు దోహదపడుతున్నాయని తెలిపారు. సృజనాత్మకతలో భాగంగా చిత్రలేఖనం, కలర్ పేపర్ కటింగ్, ఒరిగామిలో శిక్షణ పొందుతూ అద్భుతాలు సృష్టిస్తున్నారని తెలిపారు. మాయా లేదు మంత్రం లేదు.. అంతా సైన్స్ అని మూఢనమ్మకాలపై అవగాహన కోసం మ్యాజిక్ చేసి అందులోని లాజిక్‌ను వివరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తంగెళ్ల ప్రసాద్, బి.దైవకృప, పి.తిరుపతిస్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉలవపాడు: వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా స్థానిక శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు ఖోఖో పోటీలు నిర్వహించారు. తొలుత విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. నీతికథలు, మహనీయుల చరిత్రలు చదివించారు. ప్రతి రోజూ గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలు చదవాలన్నారు. శిక్షణ తరగతులకు 45 మంది విద్యార్థులు హాజరయ్యారు. గ్రంథపాలకుడు దాసరి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో తరగతులు నిర్వహించారు.

గుడ్లూరు: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు అని అందులో ఉన్న పుస్తకాలు చదవడం ద్వారా విద్యార్థులు విజ్ఞానాన్ని సంపాదించుకోవచ్చని గ్రంథపాలకుడు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. స్థానిక ఎర్రన శాఖ గ్రంథలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా సోమవారం విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్ నేర్పించడం, పుస్తక పఠనం చేయించడం, పేపరు క్రాఫ్ట్ వంటి కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం పోటీలు నిర్వహించారు.



కొండపిలో క్యారమ్స్ ఆడుతున్న విద్యార్థులు



టంగుటూరు గ్రంథాలయంలో...



గుడ్లూరు గ్రంథాలయంలో పేపర్ క్రాఫ్ట్‌లో పాల్గొన్న విద్యార్థులు

రూ.35 వేల ఆర్థికసాయం అందజేత



సహాయాన్ని అందచేస్తున్న మానవతా సంస్థ సభ్యులు

కనిగిరి రూరల్: మానవతా సంస్థ ఆధ్వర్యంలో రెండు కాళ్లు లేని రొంపిచర్ల మస్తాన్‌కు, ఆయన కుమారుడు కిడ్నీ వ్యాధిగ్రస్తుడు పెద మస్తాన్‌కు రూ.35 వేల ఆర్థికసాయాన్ని సోమవారం అందజేశారు. మానవతా సంస్థ కోశాధికారి వాగిచర్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీ వద్ద ఉంటున్న రొంపిచర్ల మస్తాన్‌కు షుగర్ వ్యాధి కారణంగా రెండు కాళ్లు తీసివేశారు. కిడ్నీ వ్యాధిగ్రస్తుడైన పెద మస్తాన్‌కు డయాలసిస్ చేయించుకుంటూ వైద్య ఖర్చులకు ఇబ్బంది పడుతున్నారు.

దీంతో మానవతా సంస్థ ఆధ్వర్యంలో రూ.15 వేలు, దాతల సాయంతో రూ.20 వేలు అందజేసినట్లు చెప్పారు. అలాగే యాక్సిక్ బ్యాంక్‌లో పనిచేస్తున్న వెంకట రామసాయి సుజిత స్పందించి ట్రై సెకిళ్లను అందచేస్తానని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సంస్థ రీజనల్ చైర్మన్ రమణారెడ్డి, కార్యదర్శి ఉమా కాంత్, డైరక్టర్లు పచ్చవ చంద్రశేఖర్, కె.బాబురావు, మాంటిస్సోరి పిచ్చిరెడ్డి, బారాయిమామ్, చిలికిచర్ల ప్రకాష్‌రావు పాల్గొన్నారు.

ఐటీఐ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కందుకూరు:

కందుకూరు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ కాలేజీ)లో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి మొదటి విడత ప్రవేశాలకు అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీఐ కాలేజీ ప్రిన్సిపాల్ జేహెచ్ హర్షవర్ధన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి లేదా ఆపై విద్యార్హత కలిగిన అభ్యర్థులు www.iti.ap.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా జూన్ 10వ తేదీ లోగారిజిస్ట్రేషన్ చేసుకోవాలని, రిజిస్ట్రేషన్ దరఖాస్తును ప్రింట్ అవుట్ తీసుకుని భద్రపర్చుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ చేసుకోలేని అభ్యర్థులు కాలేజీలో సంప్రదిస్తే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేస్తారని తెలిపారు. తరువాత తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను ధ్రువీకరించుకుని, జూన్ 10వ తేదీ నుంచి 26వ తేదీ వరకు నెల్లూరులోని వెంకటేశ్వరపురం వద్ద ఉన్న ప్రభుత్వ ఐటీఐ కాలేజీలో జరిగే కౌన్సిలింగ్ ప్రక్రియకు హాజరుకావాల్సి ఉంటుందని వివరించారు. ఎలక్ట్రిషియన్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, మెకానిక్ డీజిల్, కోపా వంటి కోర్సులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఉపాధి కూలీలకు బీమా సౌకర్యం కల్పించాలి



కూలీలతో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

హనుమంతునిపాడు: ఉపాధి హామీ కూలీలకు జీవిత బీమా కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు కోరారు. మండలంలోని వీరరాంపురం, నందనవనం పంచాయతీలో కూలీలు పనిచేస్తున్న ప్రదేశాన్ని సోమవారం సందర్శించి కూలీలతో మాట్లాడి వసతులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు ప్రభుత్వం బీమా సౌకర్యం కల్పించాలన్నారు. పనిచేస్తూ అస్వస్థతకు గురై చనిపోయిన వారికి ప్రభుత్వం రూ.10 లక్షల నష్టపరిహారం చెల్లించాలని కోరారు.